క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ



మోపిదేవి: మోపిదేవిలో వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు ఇరువురు మృతి చెందారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు వారి ఇళ్ల వద్దకు వెళ్లి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. కేసగాని వెంకటేశ్వరరావు (63) గుండెపోటుతో మంగళవారం మృతిచెందారు. అవనిగడ్డ రత్నకుమారి (62) అనారోగ్యంతో మంగళవారం రాత్రి ఇంటి వద్ద మృతిచెందారు. మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి), ఎస్సీ సెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, గ్రామ కన్వీనర్ కారుమూరి తాతయ్య పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి

కడవకొల్లు నరసింహారావు

మోపిదేవిలంక(మోపిదేవి): సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో బస్సు యాత్ర విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలను బుధవారం ఆయన కలిసి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ గురువారం బస్సు యాత్ర జరుగుతుందని, డయాలసిస్ సెంటర్‌ను అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రిలో ప్రజాప్రతినిధులు గురువారం సాయంత్రం ప్రారంభిస్తారని తెలిపారు. చంద్రబాబు మధ్యంతర బెయిల్‌కు టీడీపీ శ్రేణులు పండుగ చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబుకు హైకోర్టు పలు నిబంధనలపై బెయిలు మంజూరు చేయగా, ఆ నిబంధనలు కాదని పండుగలు చేసుకోవడం, బహిరంగంగా మైక్ ప్రచారం చేయడం కోర్టు ధిక్కరణగా ఉందని, టీడీపీ చేష్టలు చూసి ప్రజలు నవ్వు కుంటున్నారన్నారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్ ఇస్తున్నాం

విద్యుత్ డీఈఈ శివనాగేశ్వరరావు

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామని విద్యుత్ డీఈఈ పులి శివ నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. చల్లపల్లి సబ్ డివిజన్ పరిధిలోని చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల పరిధిలోని రైతులకు వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అందిస్తున్నామన్నారు. అప్పుడప్పుడూ ఓవర్ లోడ్, ఓవర్ లాప్ కారణంగా కొద్దిసేపు అంతరాయం కలుగుతుందని తెలిపారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.

మహనీయుల జీవితాలు యువతకు ఆదర్శం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం
- పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళి

నాగాయలంక: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఆయన అకుంఠిత దీక్ష, శాంతియుత పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శం కావాలని చెప్పారు. స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీవాసవీ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మండల ఆర్య వైశ్య సంఘం, వాసవీ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా జరిగింది. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, గాంధీజీ విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ మహనీయుల అడుగుజాడల్లో యువత ముందుకు సాగాలని చెప్పారు. కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి దేవస్థానం కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు చిట్టా శివనాగేశ్వరరావు, చిట్టా అన్నపూర్ణయ్య, చిట్టా శేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు మద్ది చిన్నారి, ఆకుతోట సుధీర్‌కుమార్, తానంకి వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

పెడన: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాసవీ క్షేత్రంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం జరిగింది. అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు, పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్నా మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానంతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడి భారతదేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని వివరించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లూరి రాజా, ప్రధాన కార్యదర్శి కేటీ మురళీకృష్ణ, కార్యదర్శి జవాజి నాగు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

● మోపిదేవి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద శ్రీరాములు విగ్రహానికి కోసూరు రామాంజనేయులు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.

రేపు 'జగనన్నకు చెబుదాం'..

జగనన్నకు చెబుదాం కార్యక్రమం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. అన్ని పంచాయతీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమరజీవికి ఘన నివాళి

గూడూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి తహసీల్దార్ బీవీ జయప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ వై.శివశంకర్, మండల సర్వేయరు జి.వెంకటేశ్వరరావు, వీఆర్వోలు కోటేశ్వరరావు, కరీముల్లా, బాజీరావు తదితరులు పాల్గొన్నారు.



నాగాయలంకలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తదితరులు



పెడనలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు



గూడూరులో నివాళులర్పిస్తున్న తహసీల్దార్ విజయప్రసాద్



అవనిగడ్డలో నివాళులర్పిస్తున్న కడవకొల్లు నరసింహారావు తదితరులు



బంటుమిల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తదితరుల నివాళి

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

అవనిగడ్డ: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప నాయకుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కోడూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

● బంటుమిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెలివెల చినబాబు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఈఓ వి. వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఓడిమి చిన్నారిబాబు, ఈఓపీఆర్‌డీ త్రిపురసుందరీదేవి, సర్పంచ్ జి. బాలయ్య, నాయకులు పాల్గొన్నారు. స్థానిక గాంధీ మండపంలోని అమరజీవి విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొల్లా చంద్రశేఖర్, సంఘ సభ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో, సచివాలయాల్లోను ఉపాధ్యాయులు, సిబ్బంది అమరజీవి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.

ఆసక్తి పెంచిన 'సాక్షి' మ్యాథ్స్ బీ పరీక్ష



శ్రీ బాలాజీ విద్యాలయంలో మ్యాథ్స్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో మచిలీపట్నంలో బుధవారం నిర్వహించిన మ్యాథ్స్ బీ పరీక్షలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నగరంలోని రెండు విద్యాసంస్థల్లో 'సాక్షి' మ్యాథ్స్ బీ పరీక్ష నిర్వహించారు. శ్రీ బాలాజీ విద్యాలయంలో 11 మంది విద్యార్థులు, డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో 17 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ తమకు మ్యాథ్స్ సబ్జెక్టు అంటే భయంగా ఉండేదని చెప్పారు. నిర్వాహకులు చేసిన పలు సూచనల ఆధారంగా పరీక్షను సులభంగా రాయగలగామన్నారు. వారు చేసిన సూచనలు, సలహాలు, మెలకువలు తమకు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. మాథ్స్ సబ్జెక్టు అంటే భయం పోయి ఆసక్తి కలిగేలా వారి సూచనలు ఉన్నాయని చెప్పారు. నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరీక్షలను బాలాజీ విద్యాలయంలో ఎ. ఎలిషారావు, ఎస్. సుధీనా, కేకేఆర్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ఎం. సింహాచలంనాయుడు పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉన్న 'సాక్షి' పరీక్షలు మరిన్ని నిర్వహించాలని కోరారు.

రంచనుగా సామాజిక పింఛన్ల పంపిణీ

పెడన: వైఎస్సార్ సామాజిక పింఛన్లను బుధవారం వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. పట్టణంలో 4,574 మందికి గాను మొదటి రోజు 3,665 మందికి పంపిణీ చేశారు. పింఛన్ల రూపంలో పెడన పట్టణంలోని వారికి రూ.1,27,64,750 విడుదల కాగా మొదటి రోజున లబ్ధిదారులకు రూ.1,02,27,250లను అందజేశారు. పెడన మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన వారు 5,804 మందికి రూ.1,56,80,000 విడుదలయ్యాయి. మొదటి రోజున 4,338 మందికి రూ.1,17,40,750లను అందజేశారు.

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత..

కృత్తివెన్ను: మండల పరిధిలో 80 శాతం సామాజిక పింఛన్ల పంపిణీ తొలి రోజు బుధవారం జరిగిందని ఎంపీడీఓ పిచ్చిబాబు తెలిపారు. గాంధీనగర్ గ్రామానికి చెందిన పి.ఆదిలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న యండపల్లి సచివాలయ వలంటీర్ జె. విఠల్ సాయిబాబి విజయవాడ ఆస్పత్రికి వెళ్లి ఆదిలక్ష్మికి పింఛను అందజేశారు.

మచిలీపట్నానికి ద్వితీయస్థానం

మచిలీపట్నంటౌన్: నగరంలో 19,048 పింఛన్లు ఉండగా 16,873 మందికి పింఛన్లు పంపిణీ చేసి 88.58 శాతం లక్ష్యాన్ని సాధించారు. దీంతో జిల్లాలో పింఛన్ల పంపిణీలో మచిలీపట్నం ద్వితీయ స్థానంలో నిలిచింది. నగరంలోని 8వ డివిజన్‌కు చెందిన వృద్ధుడు అబ్దుల్ హబీబ్ అనారోగ్యంతో బాధపడుతూ చింతచెట్టు సెంటర్‌లోని తన కుమారుని ఇంటి వద్ద ఉంటున్నాడు. కార్పొరేటర్ శ్రీరాం చిన్నా, వలంటీర్ శివలీల అక్కడకు వెళ్లి వృద్ధునికి పింఛను సొమ్మును అందజేశారు.

మణిపాల్ ఆస్పత్రికి వెళ్లి అందజేత..

మచిలీపట్నంటౌన్: 11వ డివిజన్ కు చెందిన మద్దెల దుర్గాప్రసాద్ గుండెపోటుకు గురై విజయవాడ మణిపాల్ ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గూడవల్లి నాగరాజు సూచన మేరకు డివిజన్ అడ్మిన్ కిరణ్ ఆస్పత్రికి వెళ్లి పింఛను సొమ్మును దుర్గాప్రసాద్‌కు అందజేశారు.

● గూడూరు: సామాజిక పెన్షన్ల పంపిణీలో గూడూరు మండలం జిల్లాలో ఐదో స్థానానికి చేరుకుంది. మండలంలో 8,486 మంది లబ్ధిదారులుండగా రాత్రి 7.30 గంటల సమయానికి 7,361 మందికి పంపిణీ చేశారు. దీంతో 87 శాతం పంపిణీతో గూడూరు మండలం ఐదో స్థానంలో ఉందని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు.



పెడన 11వ వార్డులో పింఛను అందజేస్తున్న వలంటీర్



విజయవాడ ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేస్తున్న వలంటీర్ విఠల్ సాయిబాబి



మణిపాల్ ఆస్పత్రిలో దుర్గాప్రసాద్‌కు పింఛను అందజేస్తున్న అడ్మిన్ కిరణ్



బందరులో వృద్ధుడు అబ్దుల్ హబీబ్‌కు పింఛను అందజేస్తున్న వలంటీర్ శివలీల

పేదల సొంతింటి కల నెరవేర్చిన సీఎం జగన్

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నెరవేర్చిందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 21వ డివిజన్ బందరుకోటలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ లేఅవుట్‌లో గృహ నిర్మాణాలకు పేర్ని కిట్టు బుధవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. సంవత్సరాలుగా ప్రభుత్వం నివేశనా స్థలాలు ఇవ్వకపోవడంతో పేదలు అద్దె ఇళ్లలోనే జీవిస్తున్నారన్నారు. ప్రజా సంకల్పయాత్రలో పేదల కష్టాలు దగ్గరగా చూసిన సీఎం జగన్ అధికారం చేపట్టిన తరువాత అర్హులైన ప్రతి పేదకుటుంబానికి స్థలం ఇచ్చి పక్కా గృహ నిర్మాణానికి రూ. 1.80 లక్షలు అందిస్తూ వారి కలను నెరవేర్చారని వివరించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, మాజీ చైర్మన్ బొర్రా విఠల్, కార్పొరేటర్లు మన్నే శారద, పరింకాయల విజయ్, శ్రీరాం లక్ష్మణకుమార్ (చిన్నా), వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి మన్నే శేషారావు, కొత్తగుండు రమేష్ పాల్గొన్నారు.



గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సలార్‌దాదా, చిత్రంలో పేర్ని కిట్టు

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

రావివారిపాలెం(మోపిదేవి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ క్షేత్రం సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుందని ప్రొఫెసర్ డాక్టర్ బిల్కిస్ అన్నారు. రావివారిపాలెంలో గుంటూరు లాం విద్యార్థులు బుధవారం ఉదయం గ్రామీణ అవగాహన అనుభవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొఫెసర్ మాట్లాడుతూ గత 70 రోజులుగా 23 మంది విద్యార్థులు ఇంటింటికీ తిరిగి ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. డాక్టర్ ధనుశ్రీ, డిపార్ట్‌మెంట్ హెడ్ పూర్ణిమ, కేవీకే ఘంటసాల సైంటిస్ట్ కృష్ణవేణి మాట్లాడారు.

అవినీతి నిర్మూలనకు కృషి చేయాలి

మచిలీపట్నంటౌన్: అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ వెంకట్రావు పేర్కొన్నారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టాభి గ్రామీణాభివృద్ధి సంస్థలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టాభి శిక్షణా సంస్థలో శిక్షణ పొందుతున్న వారితో అవినీతి నిర్మూలన చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. సంస్థ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అవినీతి వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు.

సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరిక

కోడూరు: సామాజిక న్యాయమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కోడూరు పంచాయతీ పరిధి దింటిమెరక, కోడూరు, తొమ్మిదో వార్డుకు చెందిన 14 మంది టీడీపీ కార్యకర్తలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ప్రధాన సెంటర్‌లో జరిగిన చేరికల కార్యక్రమంలో రమేష్‌బాబు మాట్లాడారు. కుల, మత, వర్గ, రాజకీయ భేదాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. గురువారం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ నుంచి పార్టీలో చేరిన కేసన రాజామస్తాన్, కాగిత ఏడుకొండలు, బంతు భరత్, కొనకళ్ల శ్రీనివాసరావు, పరసాబత్తిన సాల్మన్, తిరుమలశెట్టి సుబ్బారావు, కొక్కిలిగడ్డ సుబ్బారావు, మోకా కిషోర్, కన్నా కార్తీక్, మోకా కల్యాణ్, నడకుదిటి శ్రీనివాసరావు, తిరమలశెట్టి నాగరాజు, పరిశె మల్లి, వేణు, అద్దంకి వంశీలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, పలు విభాగాల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 40 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

అవనిగడ్డ: మండల పరిధి రామచంద్రపురం శివారు వలందపాలెంలో టీడీపీ నుంచి 40 కుటుంబాలు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. రామచంద్రపురం సర్పంచ్ వాకా రమేష్ ఆధ్వర్యంలో ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన 40 కుటుంబాల వారు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు కండువాలు కప్పి పార్టీలోకి వారిని ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై టీడీపీ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని చెప్పారు. వార్డు మెంబర్ ఉప్పాల రజని నేతృత్వంలో ఉప్పాల బుల్లిబాబు, బడుగు శామ్యూల్, కర్రా తిమోతి, లంకపల్లి కమలాకర్, సుధాకర్, ముక్కు అనిల్, నాగరాజు, గోవాడ మల్లితో పాటు 40 కుటుంబాలు పార్టీలో చేరారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ బచ్చు ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.



కోడూరులో టీడీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



వలందపాలెంలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న మహిళ

వైఎస్సార్ బీమా అందజేత



మచిలీపట్నంటౌన్: 38వ డివిజన్ గంగానమ్మ గుడి సమీపంలో నివాసం ఉండే దింటకుర్తి శ్రీనివాస్ కామెర్ల వ్యాధితో బాధపడుతూ మృతిచెందాడు. వైఎస్సార్ బీమా పథకం మంజూరైంది. తక్షణ సాయంగా రూ. 10 వేలను శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ శ్రీకాకోళపు నరసింహగుప్తా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ వెల్ఫేర్ కార్యదర్శి రవిప్రసాద్ పాల్గొన్నారు.

● వక్కలగడ్డ(చల్లపల్లి): వక్కలగడ్డ గ్రామానికి చెందిన లంకా శ్రీను సెప్టెంబర్ 28న కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.5 లక్షలు మంజూరు కాగా తక్షణ సాయంగా రూ.10 వేలను మృతుడి భార్య లంకా వాణికి సర్పంచ్ వల్లూరు ఉమా బుధవారం అందజేశారు. ఏఎంసీ డైరెక్టర్ మోతుకూరి ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ కిరణ్ కుమార్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటకు ప్రాణం పోసిన వర్షం

బంటుమిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షం సార్వా పంటకు ప్రాణం పోసింది. సార్వా పంట పలు దశల్లో ఉంది. రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వంతుల పద్ధతిలో కాలువలకు నీరు సరఫరా చేస్తున్నా వాతావరణ ప్రభావానికి నీటి ఎద్దడి రైతులను వెన్నాడుతోంది. ఈ క్రమంలో మధ్యాహ్నం కురిసిన వర్షం పంటలకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.